## కల్లు సీసా దొంగిలించాడని యువకుడిపై దాడి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


దెబ్బలు చూపుతున్న బాధితుడు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: కల్లు దుకాణంలో అర్ధరాత్రి కల్లు సీసాను దొంగిలించి తాగాడని ఆరోపిస్తూ ఓ యువకుడిపై నలుగురు దాడి చేశారు. ఈ ఘటన సింగారంలో జరుగగా, గురువారం దాడి చేసిన వారిపై బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత కుటంబ సభ్యుల కథనం ప్రకారం, సింగారం గ్రామానికి చెందిన వాసరవేణి భరత్ మతిస్థిమితం లేకపోవడంతో తిరుగుతుండేవాడు. ఈనెల 8న అర్ధరాత్రి కల్లు దుకాణం సమీపంలో అతడు కనిపించగా కొందరు కల్లు దొంగిలించేందుకు వచ్చాడని అనుమానించి చితక బాదారు. రెండు రోజుల నుంచి యువకుడు ఇబ్బంది పడుతుండగా కుటుంబసభ్యులు సిరిసిల్లలోని సివిల్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. వైద్యులు యువకుడి కుడిచేతి చిటికెన వేలు విరిగిపోయి, వీపుపై తీవ్రగాయాలు గుర్తించారు. దీంతో భరత్ తల్లి లత గురువారం తన కుమారుడిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

### PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Siricilla Branch, Dist. Rajanna Siricilla** agreed to accord Loan to Thummala Yamuna, W/o. Mahesh, Aged 34 Yrs, Occ: Business, R/o. 5-125, Kolanur V/o Konaraopet M/o, Rajanna Sircilla Dist, (Borrower / Property holder) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

The settler open place Sy.No. 260B/C/1/2, Area: 181.58 sq.yds, situated at Kolanur v/o Konaraopet M/o Rajanna Sircilla Dist.

**Bounded by:**
North: open place of Thummala Buchi Ramulu
South: 66' R & B Road
East: open place of Thummala Buchi Ramulu
West: open place of Poshaiah

Sd/- **R. Jagadishwer Rao,** Advocate
Nizamabad. Cell No: 98480 94409.

### PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Siricilla Branch, Dist. Rajanna Siricilla** agreed to accord Loan to Yerravelly Sulochana, W/o. Gopala Chary, Aged 49 Yrs, Occ: Business, R/o. 10-6, Kishandaspet, Yellareddypet, Rajanna Sircilla Dist, (Borrower / Property holder) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

The open place belonging to House No: 10-6, Area: 181.50 sq.yds, situated at Near Ambedkar Statue of Yellareddypet Mandal proper, Rajanna Sircilla Dist.

**Bounded by:**
North: open place of Bommakanti Rajender
South: Road
East: H.No. 10-6 of Yerravelly Gopalachary
West: Road

Sd/- **R. Jagadishwer Rao,** Advocate
Nizamabad. Cell No: 98480 94409.

నమస్తే తెలంగాణ CLASSIFIED

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

### విద్యార్థినికి ఘన స్వాగతం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13 : ఢిల్లీలో గత జనవరి 26న జరిగిన 76వ గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొన్న తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని జరుపుల సునీతకు కళాశాలలో ఘన స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొనడం ఉన్నత లక్ష్యం గా భావిస్తారని కళాశాలలో ఎన్‌సీసీ ప్రారంభించిన 2వ బ్యాచ్‌లోనే సునీత ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం విశేషమని ప్రిన్సిపల్ జయ పేర్కొన్నారు. ఇక్కడ కళాశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ కళ, వైస్‌ప్రిన్సిపాల్ రెహానా ఇప్పత్, అధ్యాపకులున్నారు.

### నియామకం

గంభీరావుపేట, ఫిబ్రవరి 13: మండలంలోని నర్మాలకు చెందిన గుండెల్లి కల్యాణ్‌కుమార్ జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ జిల్లా నూతన అధ్యక్షుడిగా కల్యాణ్‌కుమార్‌ను ప్రకటించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరంగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు.

### స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 13 : వేములవాడ పట్టణం శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థి ఫ్యాబులస్ 409 (కల్పన స్కాలర్‌షినప్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లావణ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని టీ హబ్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ డే ఆఫ్ విమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్ ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థి రమ్య ఫ్యాబులస్ 40కి ఎంపికైందన్నారు. ఇందులో భాగంగా రమ్య రూ.10 వేల స్కాలర్‌షిప్ గెలుచుకుని, విజ్ఞాన్ శాల కో ఫౌండర్ విజయ్‌వేణుగోపాల్, దర్శిని సీఈవో సీతాలక్ష్మీ చేతులు మీదుగా అందుకుందని ఆమె తెలిపారు. విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ సుమలత, అయేషా ఫాతిమా, అర్పితతోపాటు అధ్యాపకులు అభినందించారు.

### దవాఖానలో వసతులు కరువు

కోనరావుపేట, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు జవ్వాజి విమల అన్నారు. గురువారం పీహెచ్‌సీని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పూర్తిస్థాయిలో లేరన్నారు. ప్రధానంగా దవాఖానకు వచ్చే రోగులకు మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే దవాఖానకు వచ్చే గర్భిణులకు కనీస సౌకర్యాలు లేవని ఆరోపించారు. మహిళా వైద్యురాలిని దవాఖానకు కేటాయించాలని కోరారు. ఇక్కడ పలువురు సీపీఎం నేతలున్నారు.

### హామీలను నెరవేర్చాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : రాజన్న అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ ఆలయ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు డాక్టర్ మధు రాధాకిషన్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తీర్ణంలో భాగంగా నిర్వాసితులకు ఉద్యోగం, ఇతర హామీల ప్రకారం తగిన న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

### నాణాల పంపిణీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : వేములవాడ పట్టణంలో చిల్లర నాణాల కొరతను దృష్టిలో ఉంచుకొని, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) వేములవాడ శాఖ గురువారం నాణేల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న నాణేల ఇబ్బందులు తొలగుతాయని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

### ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

తెలంగాణ చౌక్/చందుర్తి/వీర్నపల్లి/ముస్తాబాద్, ఫిబ్రవరి 13: ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, సరోజినీనాయుడు జన్మదినం సందర్భంగా ప్రభుత్వం ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పద్యరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## వృక్షార్చనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- వృక్షార్చన పోస్టర్ల ఆవిష్కరణ


వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని హరితసేన జిల్లా అధ్యక్షుడు కమల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృక్షార్చన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హరితసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లను స్థానిక తెలంగాణ భవన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేసీఆర్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే మొక్కల పెంపకంపై దృష్టి సారించారని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలో సిద్దిపేటలో అనేక మొక్కలు నాటించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశంలో 3 శాతం అటవీ సంపద పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని హరితసేన నిర్వహిస్తున్న వృక్షార్చన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, పోచవేని ఎల్లయ్య, మాట్ల మధు, హరితసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు

- కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, ఫిబ్రవరి 13: సహకార సంఘ సభ్యులు, రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా గత ఐదేళ్లలో నిరంతర సేవలందించామని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం ఏర్పాటు చేసుకున్న పాలకవర్గ సమావేశానికి కొండూరు రవీందర్‌రావు హాజరై మాట్లాడారు. రైతులు మాపై ఉంచిన నమ్మకం, విశ్వాసం, బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఐదేళ్లలో వారికి మెరుగైన సేవలందించామని తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన నెలరోజుల్లోనే కరోనా వ్యాధి వ్యాపించిందని, దానిని అధిగమించి రైతులకు సహకార సంఘాలు నిరంతరంగా సేవలు అందించాయన్నారు. గ్రామాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో సంఘ పరిధిలో గోదాంల నిర్మాణం చేసుకున్నామన్నారు. నానో యూరియా, డీఏపీని గ్రామాల్లో అందుబాటులోకి తీసుకవచ్చామని, సంఘం ద్వారా రెండు డ్రోన్‌లు కొనుగోలు చేసి ఎకరాకు రూ.350 చొప్పున పిచికారీ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా సంఘ పరిధిలో ఎమ్ స్వస్థ్ ద్వారా రైతుల ఆరోగ్య పరీక్షలకు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. సంఘ డైరెక్టర్లు, చైర్మన్లు పదవులు చేపట్టి అధికారికంగా ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వారిని కొండూరు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామాంజగౌడ్, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, సలహాదారు సత్యంరావు, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, బీమ్లా, రాగుల అంజిరెడ్డి, దేవరెడ్డి, మురళి, రాజవీర్, రైతులు సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, మోతె రాజిరెడ్డి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఆలయం ఎదుట ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13: మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం వేములవాడలో ఆయన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగవద్దన్నారు. ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు, ఆలయంలోకి వచ్చి వెళ్లే దారుల్లో ఏర్పాట్లను పోలీస్, ఆలయ అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈవో వినోద్‌రెడ్డి తదితరులున్నారు.

### ఓటర్ జాబితాపై సమావేశం

సిరిసిల్ల రూరల్/ముస్తాబాద్/రుద్రంగి/వీర్నపల్లి, ఫిబ్రవరి 13 : తంగళ్లపల్లి, ముస్తాబాద్, రుద్రంగి మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రాలపై అఖిలపక్ష సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గజభీంకార్ రాజన్న, గుజ్జుల రాజిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13 : తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో చెల్ల శ్రీవర్ధన్ (2) బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఒగులాపూర్‌కు చెందిన శ్రీవర్ధన్ ఒగులాపూర్ శివారులో ఇందిరమ్మ కాలనీలో తల్లిదండ్రులతో రాగా ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. బాలుడిని దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ఆర్థిక సాయం

ముస్తాబాద్, ఫిబ్రవరి 13: మండల కేంద్రానికి చెందిన బిట్ల సంతోష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి దాతలు గురువారం ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి దాతల ద్వారా సమకూరిన రూ.48 వేలు అందించారు.

### పనుల్లో పారదర్శకత కోసమే ఆడిట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: అభివృద్ధి పనుల్లో పారదర్శకత కోసమే సోషల్ ఆడిట్ అని ఉపాధి హామీ కింద చేసిన ప్రతి పనికీ పారదర్శకమైన లెక్కలుంటాయని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 24 గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు, అందుకు సంబంధించిన ఖర్చులను ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా తెలుసుకున్నారు. ఇక్కడ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో సత్తయ్య, తదితరులున్నారు.

## మల్కపేట కాల్వలోకి నీటి విడుదల

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: మల్కపేట కాల్వలోకి అధికారులు నీటిని వదలగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అల్మాస్‌పూర్ నుంచి బాకుర్‌పల్లి వరకు మల్కపేట కాలువ పరీవాహక పొలాలు ఎండిపోతున్న తరుణంలో రైతులు ఆవేదన చెందుతూ అధికారులు, నాయకుల చుట్టూ నీళ్ల కోసం తిరిగారు. చివరికి అధికారులు కాల్వలో పూడిక పనులు చేపట్టి బుధ, గురువారాల్లో నీళ్లను వదిలారు. కానీ మల్కపేటలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున కాల్వ ద్వారా వచ్చే నీరు రాజన్నపేటలోని కొత్త చెరువు, తిమ్మాపూర్‌లోని మైసమ్మ చెరువు నిండేంత వస్తాయా లేదా? అని ఉద్వేగంగా ఎదురు చూస్తున్నారు.

### మత్తడి దుంకిన మద్దికుంట చెరువు

ముస్తాబాద్, ఫిబ్రవరి 13: మండలంలోని మద్దికుంట చెరువుకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు చేరుకోవడంతో గురువారం మత్తడి దుంకుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో మెట్ట ప్రాంతానికి ఎండాకాలంలో గోదావరి జలాలు వస్తున్నాయని రైతులు సంబురపడుతున్నారు. యాసంగికి ఢోకా లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### అడవికి నిప్పు పెట్టద్దు

వీర్నపల్లి, ఫిబ్రవరి13: అడవికి వెళ్లే పశువుల కాపర్లు, ప్రయాణికులు ఉద్దేశ పూర్వకంగా అడవికి నిప్పుపెట్టవద్దని అటవీ శాఖ అల్మాస్‌పూర్ సెక్షన్ అధికారి పద్మలత సూచించారు. మండలంలోని కంచర్ల అటవీ ప్రాంతంలో గురువారం ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి సమీపిస్తున్నందున అడవిలో నిప్పు అంటుకుంటే ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. విలువైన అటవీ, జంతు సంపద నాశనం అవుతుందని పేర్కొన్నారు. సిగరెట్లు, బీడీలు కాల్చి పడేయవద్దని తెలిపారు.

## బ్లాక్ మెయిల్, బెదిరింపు రాజకీయాలకు భయపడం

- అసత్య ఆరోపణలు మానుకోవాలి
- బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు
- కాంగ్రెస్ నేతల ఆరోపణలపై ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13 : బ్లాక్ మెయిల్, బెదిరింపు రాజకీయాలకు ఎవరూ భయపడేవారు లేరని బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు కాంగ్రెస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నేతలు తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బాధితులకు న్యాయం చేయమంటే, బెదిరింపు రాజకీయం చేస్తూ, అసత్య ఆరోపణలు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అక్రమాలను బయటపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతల అన్యాయాలు అక్రమాలు బయటపెడితే రోడ్డు మీద తిరగలేరన్నారు. దమ్ముంటే రేపు అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి తనపై ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అక్రమాలు చేయడం తప్ప వారికి ఏం తెలియదని ఎద్దేవా చేశారు. తాను పది సంవత్సరాలుగా సర్పంచ్‌గా చేశానని, వార్డు మెంబర్‌గా గెలువని నీవా మాట్లాడేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ప్రమోషన్లు, జాబులు ఇప్పిస్తానని బడుగు బలహీనవర్గాల వద్ద డబ్బులు వసూలు చేస్తే బాధితులకు న్యాయం చేయాలని అడిగితే మాపై వ్యక్తిగత అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పైస్థాయి అధికారులను నిలదీస్తే కూడా చర్యలు తీసుకోలేదని మాపై మాత్రం అక్రమ కేసులు పెట్టారన్నారు. విషయ పరిజ్ఞానం లేకుండా కాంగ్రెస్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీళ్ల కోసం 60 ఎకరాల భూసేకరణ చేసి ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చిన ఘనత కేటీఆర్‌దేనన్నారు. భూసేకరణలో కొందరు చెక్కులు రాకపోతే ఇప్పటివరకు కూడా ఎందుకు చెక్కులు ఇప్పించలేదని ప్రశ్నించారు. అగ్రికల్చర్ కాలేజీకి 40 ఎకరా లు భూమి కోల్పోయిన వారికి ప్రభుత్వ భూముల పట్టాలిచ్చి వారికి న్యాయం చేసినట్లు తెలిపారు. ఎంత మంది దగ్గర డబ్బులు తీసుకున్నావో ఎంత మంది ఉసురు తీసుకున్నవో అందరికీ తెలుసన్నారు. మీ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి దళితుల భూములు గుంజుకుని అక్రమంగా 30 మందికి రిజిస్ట్రేషన్ చేశాడని, వస్తే ఆధారాలతో నిరూపిస్తామన్నారు. రేషన్ షాపు మంజూరులో డబ్బులు దోచుకున్న సంగతి అందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా మా నాయకుడు, తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిలివేరి చిరంజీవి, కొయ్యెడ రమేశ్, కుర్మ రాజు, బండి జగన్, నక్క కొమురయ్య, గుండు ప్రేమ్, నక్క రవి, అమర్‌రావు, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు అవదూత మహేందర్, కృష్ణారెడ్డి, మల్లారపు నరేశ్, తిరుపతి, జీవన్, రమేశ్, అఫ్రోజ్, పరశురాములు, శ్రీను, మహేశ్, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

## చిలుకూరు బాలాజీ అర్చకుడిపై దాడి అమానుషం


మాట్లాడుతున్న రాజన్న ఆలయ అర్చకులు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని రాజన్న ఆలయ అర్చకులు అన్నారు. దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్ నిత్యం దైవసేవలో పాల్గొనే అర్చకుడన్నారు. అర్చకుల సంక్షేమం, హిందూ ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్న రంగరాజన్‌పై హింసాపూరితంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ప్రధానార్చకుడు ఈశ్వరగారి సురేశ్, ఉప ప్రధానార్చకుడు, ఆలయ యూనియన్ ఉపాధ్యక్షుడు చంద్రగిరి శరత్, గోపన్నగారి చందు, వేద పండితులు గర్శకుర్తి శ్రీధర్, చక్రవర్తుల పవన్, ఏఈవో శ్రవణ్, ఆలయ పర్యవేక్షకులు వరి నర్సయ్య, యూనియన్ కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నగర్‌ను గ్రామ పంచాయతీ చేయండి


వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13 : తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో కేసీఆర్ సర్కార్ ఏర్పాటు చేసిన కేసీఆర్‌నగర్ (డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం)ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గురువారం ఎంపీడీవో లక్ష్మీనారాయణకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిసిల్ల పట్టణం, మండెపల్లివాసుల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం 1,320 డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం నిర్మించారని ఇక్కడ 1,340 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారని 5 వేల వరకు జనాభా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు పంచాయతీగా ప్రకటించకపోవడం అన్యాయమని స్థానిక సంస్థల ఓటరు జాబితాలో కూడా ఈ ఓటర్లను చూపకపోవడం సరి కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కేసీఆర్‌నగర్‌ను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేసి, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీపీ ఏర్పాటు కాకపోతే ఓటు హక్కు వినియోగించుకోలేక పోతారని తక్షణమే నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందుకూరి రామాగౌడ్ ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : జిల్లాలోని పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికులు గురువారం ధర్నాకు దిగారు. జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికులు సుమారు 200 మంది వరకు ధర్నాలో పాల్గొన్నారు. గత జూలై నెల నుంచి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ జీపీ యూనియన్, జిల్లా కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసిన జిల్లాలోని కార్మికుల వేతనాలు మాత్రం గత జూలై నుంచి పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. కలెక్టర్ కార్మికుల వేతనాల విషయంలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండలాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, లోకిని శ్రీనివాస్, నారపురం నర్సయ్య, అక్కల అంజయ్య గౌడ్, సందెల మహేశ్, రాజశేఖర్, అనిల్ కార్మికులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 13: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సిరిసిల్ల జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్ అన్నారు. ఈమేరకు గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన లీగల్ ఎయిడ్ క్లినిక్ ఫర్ చిల్డ్రన్ ప్రోగ్రాంకు హాజరై, మాట్లాడారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో ఇద్దరిని ఎంపిక చేసి వారికి ప్రతి నెలలో రెండుసార్లు ఉచిత న్యాయసలహాలు, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇక్కడ హెచ్ఎం శారద, తిరుపతి, రవి, రాధారాణి, సురేశ్ తదితరులున్నారు.

## ఎన్నికల బాధ్యతలు పారదర్శకంగా నిర్వర్తించాలి

- డీపీవో, నోడల్ అధికారి శేషాద్రి
- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న డీపీవో నోడల్ అధికారి శేషాద్రి

కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని డీపీవో, నోడల్ అధికారి శేషాద్రి సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీవో, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడుతూ, ఎన్నికల నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన కర దీపికను చదువుకుని ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలున్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఆక్షేపణలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో డీఎల్పీవో నరేశ్, మాస్టర్ ట్రెయినర్లు తదితరులు పాల్గొన్నారు.